JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 314
పేజీలు : 8 | వెల : 5
మేడ్చల్ - మల్కాజ్‌గిరి | శనివారం 11-04-2026
Medchal - Malkajgiri | Saturday 11-04-2026
Follow: jayabherinews
Vol. 02 | Issue 314 | Pages : 8 | ₹: 5



## కేసీఆర్‌తో జీవన్ రెడ్డి
# భావోద్వేగం

**ఆ దేవుడే మీతో కలిసి పని చేయమని పంపాడంటూ..**

- ఎర్రవల్లికి చేరుకున్న జీవన్ రెడ్డికి కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ పార్టీ నేతలు స్వాగతం
- ఏప్రిల్ 20న జీవన్ రెడ్డి అధికారికంగా గులాబీ కండువా
- కాంగ్రెస్‌తో 40ఏళ్ల ప్రయాణానికి ముగింపు పలికిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి
- కొత్తవారిని అందలం ఎక్కించారనీ... తమను ఘోరంగా అవమానించారని ఆవేదన

**జయభేరి, హైదరాబాద్ :**

కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పిన సీనియర్ నేత జీవన్ రెడ్డి కారు పార్టీలో చేరబోతున్నారు. గులాబీ కండువ కప్పుకోనున్నట్టు ఇప్పటికే స్పష్టం చేసిన జీవన్ రెడ్డి.. శుక్రవారం (ఏప్రిల్ 10) బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కలిశారు. ఎర్రవల్లికి చేరుకున్న జీవన్ రెడ్డికి కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ పార్టీ నేతలు స్వాగతం పలికారు. ఇక ఫామ్‌హౌస్‌లో తనను కలిసిన జీవన్‌రెడ్డిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు కేసీఆర్. శాలువాతో జీవన్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఆ దేవుడే మీతో కలిసి పని చేయమని నన్ను పంపాడంటూ కేసీఆర్‌తో అన్నారు. కాసేపు మాట్లాడిన తరువాత జీవన్ రెడ్డి బృందాన్ని లంచ్‌కు ఆహ్వానించారు కేసీఆర్. అంతకుముందు టీవీ9తో మాట్లాడిన జీవన్ రెడ్డి 2014లోనే కేసీఆర్‌తో కలిసి రాజకీయ ప్రయాణం చేసే అవకాశం వచ్చిందని తెలిపారు. కానీ నాడు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా కాంగ్రెస్‌లోనే కొనసాగానన్నారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ వార్షికోత్సవం ఉండటంతో.. ఆలోపే పార్టీలో జీవన్ రెడ్డి చేరిక ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. కేసీఆర్‌ను కలిసి చర్చలు ...మిగతాది 2 లో

# ప్రధాని మోదీ హత్యకు కుట్ర..?

- అమెరికా నిఘా సంస్థతో బేరసారాలు..
- 22 ఏళ్ల అమన్ తివారీతోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు



**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 :**

బీహార్‌లో సంచలనాత్మక కేసు వెలుగులోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హత్య కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఇందుకు సంబంధించి 22 ఏళ్ల అమన్ తివారీతోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టిస్తోంది. భద్రతా సంస్థలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఈ మొత్తం ఘటనపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని డీజీపీ తెలిపారు. అతనిపై గతంలో ఒక కేసు ఉన్నట్లు సమాచారం అందింది. అన్ని కోణాల్లోనూ క్షుణ్ణంగా దర్యాప్తు జరుగుతోంది. ఆ యువకుడి అసలు ఉద్దేశం ఏమిటో కూడా నిర్ధారిస్తున్నామని డీజీపీ తెలిపారు. ...మిగతాది 2 లో



## దక్షిణాది ప్రజల నుంచి
# రియాక్షన్ తప్పదు

- ఉద్యమాలకు దారి తీస్తుంది.. వెనక్కి తీసుకోకతప్పదు
- మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకూ కోటా కల్పించాలి
- లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచితే దక్షిణాదికి నష్టమేనని పునరుద్ఘాటించిన రేవంత్ రెడ్డి

**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:**

ఎన్డీయే చెబుతున్న మాదిరిగా 50 శాతం సీట్ల పెంపుతో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం మరింతగా పెరిగి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆర్థికంగా, రాజకీయంగా కొనసాగుతున్న వివక్షతో దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే గాయపడి ఉన్నాయని, డీలిమిటేషన్ పేరుతో రెచ్చగొట్టవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయినా, ముందుకెళ్లి సీట్ల పెంపును చేపడితే.. దక్షిణాదిన ప్రజల నుంచి రియాక్షన్ వస్తుందని, వివక్ష ఏర్పడి అది ఎక్కడికైనా దారి తీస్తుందని హెచ్చరించారు. మీడియా ప్రతినిధులు వివరణ కోరగా... ప్రజా ఉద్యమాలకు దారి తీస్తుందని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ విషయంలో కేంద్రం ముందుకు వెళితే.. నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న మాదిరిగా దీనిని కూడా వెనక్కి తీసుకోక తప్పదని హెచ్చరించారు. ద్రవిడులమని ఇప్పటికే చిన్నచూపు చూస్తున్నారని, రాజకీయంగానూ వివక్ష చూపుతున్నారని తెలిపారు. సీట్ల పెంపుతో దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న అంతరం ఇక ఏమాత్రం పెరగరాదని స్పష్టం చేశారు. ఢిల్లీలోని తన నివాసంలో శుక్రవారం రాత్రి మీడియా ప్రతినిధులతో సీఎం రేవంత్ ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. సీడబ్ల్యూసీ భేటీలో చర్చకు వచ్చిన అంశాలను ప్రస్తావిస్తూ.. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు, తెలంగాణకు జరిగే అన్యాయాన్ని వివరించానని, పార్టీ అధిష్ఠానం తన అభిప్రాయాలను నోట్ చేసుకుందని చెప్పారు. పునర్విభజనపై ఇండియా కూటమి పక్షాలతో చర్చించాలని సీడబ్ల్యూసీ భేటీలో నిర్ణయించినట్లు చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనతో పెద్ద రాష్ట్రాలు మరింత పెద్దగా, చిన్న రాష్ట్రాలు ...మిగతాది 2 లో

# ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్

- రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం
- నితీశ్ కుమార్ తన ఖాతాలో ఓ అరుదైన ఘనత



**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 :**

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు తీసుకున్నారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ పరిణామంతో ఆయన ఇక జాతీయ రాజకీయాలకే పరిమితం కానున్నట్లు స్పష్టమైంది. త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు నితీశ్ స్వయంగా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకారంతో నితీశ్ కుమార్ తన ఖాతాలో ఓ అరుదైన ఘనతను చేర్చుకున్నారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ.. ఇలా నాలుగు చట్టసభల్లోనూ సభ్యుడిగా పనిచేసిన కొద్దిమంది నేతల జాబితాలో ఆయన చేరారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ఆయన గురువారమే ఢిల్లీకి చేరుకున్నారు. మార్చి 16న రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన నితీశ్, మార్చి 30న తన శాసనమండలి సభ్యత్వానికి (ఎమ్మెల్సీ) రాజీనామా చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన ముఖ్యమంత్రి పదవి నుంచి కూడా తప్పుకోవాల్సి ఉంటుంది.ఈ సందర్భంగా ...మిగతాది 2 లో



## ఫీజల నియంత్రణపై
# కేబినెట్ కీలక నిర్ణయం

- మల్టీ జోనల్ వ్యవస్థ అమలు చేసే దిశగా నిర్ణయం
- పార్లమెంట్‌లో రాజధాని అమరావతి చట్టం ఆమోదం పొందిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి క్యాబినెట్ కృతజ్ఞతలు
- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట్ కింద మూడు ప్రముఖ సంస్థల స్థాపనకు కూడా క్యాబినెట్ అనుమతి

**జయభేరి, అమరావతి :**

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. ఉద్యోగులకు రావాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం బిగ్ అప్డేట్ ఇచ్చింది. ఇక.. మావిగన్ వివాదం వేళ అమరావతి కేంద్రంగా ఏపీ మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అదే విధంగా 28 జిల్లాల ఏర్పాటుతో జోన్ .. మల్టీ జోనల్ వ్యవస్థకు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది. పాలనా పరంగా తీసుకునే ముఖ్య నిర్ణయాలకు ఏపీ మంత్రివర్గం చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఏపీ మంత్రివర్గ సమావేశం జరగనుంది. కీలక అంశాలే ప్రధాన అజెండాగా ఈ సమావేశం జరుగుతోంది. ఇందులో ప్రధానంగా రాష్ట్రంలో 28 జిల్లాల ఆధారంగా జోనల్ వ్యవస్థను ఖరారు చేసే అంశంపై కూడా చర్చ జరగనుంది. భవిష్యత్తులో ఉద్యోగ నియామకాలు, మల్టీ జోనల్ వ్యవస్థ అమలు చేసే దిశగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీనికి సంబంధించి ఆమోదం పొందిన తరువాత ...మిగతాది 2 లో

## అభివృద్ధి పథంలో
# తెలంగాణ



- సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు
- తెలంగాణకు కేంద్రం భారీ కానుక..
- రూ.103 కోట్లతో రెండు కొత్త రైల్వే ప్రాజెక్టులు.. కిషన్ రెడ్డి హర్షం

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. 'సేతు బంధన్' పథకం కింద రూ.103 కోట్లతో రెండు నూతన ప్రాజెక్టులను మంజూరు చేస్తూ కేంద్ర రోడ్డు రవాణా శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నిధులతో నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ప్రధాన రైల్వే వంతెనల నిర్మాణం చేపట్టనున్నారు. ఇది స్థానిక రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది.

**అభివృద్ధి పథంలో తెలంగాణ: కిషన్ రెడ్డి హర్షం**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదకొండేళ్లుగా తెలంగాణ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ...మిగతాది 2 లో

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్లలో ఆనందం

...మిగతాది 3 లో

మొదటిపేజీ తరువాయి

## కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భావోద్వేగం

జరిపిన జీవన్ రెడ్డి ఎప్పుడు అధికారికంగా బీఆర్ఎస్ కండువా కప్పుకునే తేదీని ఖరారు చేశారు. ఏప్రిల్ 20న జీవన్ రెడ్డి అధికారికంగా గులాబీ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. జగిత్యాల్లో భారీ బహిరంగ సభలో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నారు. ఇందుకు సంబంధించిన సభాస్థలి, ఏర్పాట్లను ఎమ్మెల్సీ గంగుల కమలాకర్, ఎల్.రమణ, విద్యాసాగర్ రావు పరిశీలన చేయనున్నారు. ఇదిలావుంటే, కాంగ్రెస్‌తో 40ఏళ్ల ప్రయాణానికి ముగింపు పలికిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి.. BRSలో చేరాలని నిర్ణయించుకున్నారు. అయితే, ఫ్యూచర్‌పై ఆయన తీసుకున్న నిర్ణయం.. పొలిటికల్‌గా నిపుణుల రాజేస్తోంది. అయితే, కాంగ్రెస్‌కు బద్ధ వ్యతిరేకిగా ఆవిర్భవించిన టీడీపీతో రాజకీయ ప్రస్థానం మొదలెట్టిన జీవన్‌రెడ్డి.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో కరుడుగట్టిన హస్తం వాదిగా మారిపోయారు. అలాంటి నాయకుడు ఇప్పుడిలా.. పార్టీ మారాలనే నిర్ణయం తీసుకోవడం తీవ్ర చర్చకు దారితీసింది. అసలు కాంగ్రెస్‌లో జీవన్‌రెడ్డికి ఏం తక్కువైందన్నది ఆ పార్టీ నేతలు అడుగుతున్న ప్రశ్న. అందుకు సీనియర్ నేత సైతం అదే తరహా సమాధానాలు సంధిస్తున్నారు. జీవన్‌రెడ్డి మాత్రం.. కాంగ్రెస్‌తో ఇన్నేళ్ల ప్రయాణంలో.. మనోవ్యథ తప్ప మిగిలిందేటని ప్రశ్నిస్తున్నారు. రేవంత్ రెడ్డి వచ్చాక.. అసలు కాంగ్రెస్ పక్కకు పోయి, నిజమైన కార్యకర్తలకు తీరని ద్రోహం జరిగిందంటూ.. తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉంటూ పార్టీకోసం కష్టపడ్డ కార్యకర్తలకు అన్యాయం చేసి.. కొత్త వారిని అందలం ఎక్కించారని.. తమను ఘోరంగా అవమానించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు పార్టీలో తనపట్ల రెస్పెక్ట్ లేకుండా వ్యవహరించారని చెబుతున్నారు. దీనివల్ల మానసిక వేదన అనుభవించానని జీవన్ రెడ్డి అంటున్నారు. మొత్తానికి, జీవన్ రెడ్డి రాజకీయ ప్రయాణం.. అభిమానం, అవమానం కలగలసిన గతస్మృతులతో ముడిపడి మంటలు పుట్టిస్తోంది. మరి, ఆయన కొత్త జర్నీ మున్ముందు ఎలా సాగుతుందో చూడాలి.

## అభివృద్ధి పథంలో తెలంగాణ

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కొనియాడారు. ముఖ్యంగా రోడ్డు రవాణా, రైల్వే రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యతనిస్తూ నిరంతరం నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాజాగా మంజూరైన ప్రాజెక్టులపై ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్ర ప్రజల తరపున ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

కేంద్ర రోడ్డు మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఎఫ్) కింద ఈ పనులకు ఆమోదం లభించింది. వీటిలో ప్రధానంగా రెండు ముఖ్యమైన ప్రాంతాలకు లబ్ధి చేకూరనుంది:

**నల్గొండ జిల్లా:** నార్కట్ పల్లి - మునుగోడు రైల్వే లైన్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బి) కోసం రూ.69 కోట్లు కేటాయించారు.

**ఖమ్మం జిల్లా:** మధిర రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే అండర్ పాస్, పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి, అలాగే అనుసంధాన రహదారుల అభివృద్ధికి రూ.34 కోట్లు ఖర్చు చేయనున్నారు.

ఈ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే పల్లెలు, పట్టణాల మధ్య రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయి. రైల్వే గేట్ల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా ఇంధన వినియోగం కూడా తగ్గుతుంది. ముఖ్యంగా రైల్వే మార్గాల వద్ద జరిగే ప్రమాదాలను నివారించడానికి ప్రయాణికుల భద్రతను పటిష్టం చేయడానికి ఈ వంతెనలు ఎంతో దోహదపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా కేంద్రం పని చేస్తోందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు పట్టాలెక్కనున్నాయని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ రహదారి, రైల్వే అనుసంధాన ప్రాజెక్టులు వెన్నెముకగా నిలుస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఫీజల నియంత్రణపై కేబినెట్ నిర్ణయం

గెజిట్ జారీ చేయనున్నారు. ఇక.. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్ట్ ఉద్యోగులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభించారు. మొత్తం రూ.2,950 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తోందని, ఈ నిధులు రిటైర్డ్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. సర్వీసు లో ఉన్న పోలీసు ఉద్యోగుల సరెండర్ లీవ్ బిల్లుల చెల్లింపులు కూడా ప్రారంభమయ్యాయి. ఇక, ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, పరిపాలనకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

**కీలక అంశాల పై చర్చ..**

ఆమోదం ఇటీవల పార్లమెంట్‌లో రాజధాని అమరావతి చట్టం ఆమోదం పొందిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి క్యాబినెట్ కృతజ్ఞతలు తెలపనుంది. ఇక పెట్టుబడుల అంశంలో భాగంగా, 16వ ఎస్ఐపిబి సమావేశంలో చర్చించిన ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం తెలిపే అవకాశం కనిపిస్తోంది. మొత్తం 31 ప్రాజెక్టులకు సంబంధించిన రూ.39,436 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు, ఉపాధి అవకాశాలను కూడా పెంచనున్నాయి. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట్ కింద మూడు ప్రముఖ సంస్థల స్థాపనకు కూడా క్యాబినెట్ అనుమతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే విద్యారంగానికి సంబంధించి ఫీజు రెగ్యులేటరీ కమిటీ (FRC) ఏర్పాటు కోసం ఆర్డినెన్స్‌కు కూడా ఆమోదం తెలపనున్నారు. రాజధాని అమరావతి నిర్మాణంపై చర్చించనున్న క్యాబినెట్.. పలు సంస్థలకు భూ కేటాయింపులకు అమోదం తెలపనుంది. మావిగన్ పైన వైసీపీ చేస్తున్న ప్రచారం వేళ.. రాజకీయంగానూ అధికారిక అజెండా పూర్తయిన తరువాత మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించి.. కీలక దిశా నిర్దేశం చేసే అవకాశం కనిపిస్తోంది.

## ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్

ఢిల్లీలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. "బిహార్‌లో చాలా పనులు చేశాను. ఇక ఇక్కడే (ఢిల్లీ) ఉండి సేవ చేయాలని భావిస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తాను. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు చేపడతారు" అని స్పష్టం చేశారు. 2005 నవంబర్‌లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నితీశ్ కుమార్ అసెంబ్లీకి పోటీ చేయకుండా, శాసనమండలి సభ్యుడిగానే కొనసాగుతున్నారు. 2006 నుంచి వరుసగా నాలుగుసార్లు ఆయన ఎమ్మెల్సీగా పనిచేశారు. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్, ఆ తర్వాత లోక్‌సభ ఎంపీగా కూడా సేవలందించారు. తాజా పరిణామంతో బిహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలుకానున్నాయి.

## స్కూల్ బస్సులు అగ్నికి ఆహుతి



**కమలాపురం :** మండల పరిధిలోని కోగటం గ్రామంలో ఊరి బయట నైట్ హాల్ట్ కొరకు పెట్టుకున్న వివిధ స్కూల్, కాలేజ్ లకు చెందిన మూడు వాహనాలు గురువారం అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగి కాలిపోయాయి. సమాచారం అందుకున్న కమలాపురం పోలీసులు, ఫైర్ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో గీతాంజలి హై స్కూల్, ఐడియల్ పబ్లిక్ స్కూల్,. గోపికృష్ణ మాంటెస్సోరి హై స్కూల్ వాహనాలు దగ్ధం అయ్యాయి. మంటలకు గల కారణాలు తెలియరాలేదు.

# పొంచి ఉన్న కరువు పరిస్థితులు

> ఈ ఏడాది వర్షాలు కురిసే అవకాశం కనిపించడం లేదని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వర్షా కాలం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది రైతులకు అత్యంత కష్టతరంగా మారబోతోందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే ముందుగానే ఈ హెచ్చరికలు వచ్చాయి. కానీ ఎల్ నినో ప్రభావం ఈ స్థాయిలో ఉండబోతుంది అని తెలుస్తుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.



గత ఏడాది రికార్డు స్థాయిలో వర్షాలు కురిసాయి. పంటలు సమృద్ధిగా పండాయి. కానీ ఈ ఏడాది అలా పరిస్థితి ఉండదని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రధానంగా పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా మారుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా.. 2026 లో అత్యంత బలమైన ఎల్ నినో పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురిసే అవకాశం కనిపించడం లేదని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వర్షాకాలం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది రైతులకు అత్యంత కష్టతరంగా మారబోతోందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే ముందుగానే ఈ హెచ్చరికలు వచ్చాయి. కానీ ఎల్ నినో ప్రభావం ఈ స్థాయిలో ఉండబోతుంది అని తెలుస్తుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.కొన్ని ప్రాథమిక విశ్లేషణల ప్రకారం ఈ ఏడాది ఇబ్బందికర పరిస్థితులు తప్పవని అర్థమవుతోంది. ఈ శతాబ్దంలోనే అత్యంత తీవ్రమైన ఉష్ణమండల వాతావరణం నమోదయ్యే ప్రమాదం ఉంది. రుతుపవనాల గమనాన్ని అస్తవ్యస్తం చేసి.. వర్షాలు పడకుండా చేస్తోందని తెలుస్తోంది. వ్యవసాయ రంగం దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్న ప్రతిసారి మన దేశంలో వర్షపాతం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అటువంటిది ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సుదీర్ఘమైన కరువు కాటకాలకు దారి తీయవచ్చు అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే నైరుతి రుతుపవనాలను ఎల్ నినో నాశనం చేస్తుందని చెబుతున్నారు. వర్షాలు సరిగ్గా పడక తీవ్ర దుర్భిక్షం ఏర్పడుతుందని.. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గి.. భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని.. రైతాంగం తీవ్ర పెట్టుబడి నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరికలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.మెరికా, ఇరాన్ దేశాల మధ్య నిన్నటి దాకా భీకరమైన యుద్ధం జరిగింది.

కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా ఆ యుద్ధం తాత్కాలికంగా వాయిదా పడింది. యుద్ధం వల్ల జరిగే దాడులు విపరీతమైన కాలుష్యానికి కారణమవుతుంటాయి. కాలుష్యం వల్ల వాతావరణంలో అనేక రకాలుగా మార్పులు చోటుచేసుకుంటాయి. వాటి వల్ల కరువు కాటకాలు ఏర్పడుతుంటాయి. రెండవ ప్రపంచ యుద్ధాన్ని తీసుకుంటే.. నాడు అమెరికా వేసిన న్యూక్లియర్ బాంబు వల్ల జపాన్ తీవ్రంగా నష్టపోయింది. ఆ బాంబు వేసిన ప్రాంతంలో ఇప్పటికీ పచ్చ గడ్డి కూడా మొలవడం లేదు. దీనిని బట్టి యుద్ధం లాంటి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు ప్రకృతి ఎంత ప్రభావితమవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధం తాత్కాలికంగా ముగిసింది అనుకుంటే.. మరో ఉపద్రవం ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈసారి ప్రపంచాన్ని ఆ విధంగా కలవరపెడుతున్న అంశం యుద్ధం కాదు.. మరొకటి కాదు.. అది కరువు.ఈ కరువు ఏర్పడేందుకు ప్రధాన కారణం పసిఫిక్ మహాసముద్రం. కొంతకాలంగా పసిఫిక్ మహాసముద్రం వేడెక్కుతోంది. దీనివల్ల ఎల్ నినో ఏర్పడుతోంది. ఎల్ నినో అనేది పసిఫిక్ సముద్రంలో సాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి ఏర్పడుతున్న ఎల్ నినో అత్యంత ప్రమాదకరమైనది. దీనివల్ల 2027 వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎండలు మండిపోతాయట. చివరికి ధ్రువ ప్రాంతాలలో కూడా ఉష్ణోగ్రతలు పెరుగుతాయట. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశమైన భారత్ లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం లేదట. దీనివల్ల సాగురంగం పూర్తిగా దెబ్బతింటుందట. మనదేశంలో కరువు పరిస్థితి ఉంటే.. దక్షిణ అమెరికాలో భారీగా వరదలు వస్తాయట. విస్తారమైన వర్షాలు కురిసి ప్రాంతాలకు ప్రాంతాలు మీట మునిగిపోతాయట. సముద్ర తీర ప్రాంతం మరింత ముందుకు దూసుకు వస్తుందట.. తీర ప్రాంతాలు కోతకు గురి అవుతాయట.మనదేశంలో కరువు అనుకుంటే.. ఆసియా మొత్తం కూడా కరువు వచ్చే అవకాశం ఉంటుందట. వాతావరణ మొత్తం అల్లకల్లోలంగా ఉంటుందట. అందువల్లే ఇప్పటినుంచే ఆయా ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కరువు వల్ల చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆహార ధాన్యాలకు.. ఇతర తిండి గింజలకు తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. ఆ సమయంలో మరణాలు కూడా చోటుచేసుకుంటాయి. ఇవన్నీ జరగకూడదు అనుకుంటే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సర్వసాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి అత్యంత తీవ్రమైన ఎల్ నినో ఏర్పడడం వల్ల కరువు కాటకాలు అధికంగా వస్తాయట.ఒక్క వర్షాభావ పరిస్థితులే కాదు.. దేశ వ్యాప్తంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని కూడా హెచ్చరికలు వస్తున్నాయి. అసాధారణ రీతిలో పెరుగుతాయని సంకేతాలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయరంగం పూర్తిగా దెబ్బతింటే ఆ ప్రభావం దేశం పై పడుతుంది. అందుకే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకసారి మన దేశ చరిత్రను గమనిస్తే.. ఎక్కువ శాతం కరువులు ఎల్ నినో సమయంలో సంభవించినవే. 2009లో అత్యంత తీవ్రమైన ఎల్ నినో కారణంగా దేశంలో అంతకు ముందు 30 ఏళ్లలో లేనంతగా.. 22 శాతం వర్షపాతం తగ్గింది. దీనికి కారణంగా దేశవ్యాప్త కరువుకు దారితీసింది. 2014 నుంచి 2016 మధ్య ఎల్ నినో ప్రభావంతో వరుసగా రెండు సంవత్సరాలు వర్షాలు తగ్గి వ్యవసాయరంగం తీవ్రంగా నష్టపోయింది. 2023 లో కూడా ఎల్ నినో ప్రభావంతో ఆగస్టు నెలలో వందేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదయింది.. అయితే ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడంతో తీవ్ర దుర్భిక్షం తప్పదన్న హెచ్చరికలు వస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## దక్షిణాది ప్రజల నుంచి రియాక్షన్

మరింత చిన్నగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు టాప్ 10 ప్రాధాన్యం ఉన్న శాఖల్లో కనీసం నాలుగైనా దక్షిణాదికి ఇచ్చిందని, ఉత్తరాదికి చెందిన వ్యక్తి ప్రధానిగా ఉంటే దక్షిణాదికి రాష్ట్రపతి పదవి ఇచ్చి సమతుల్యత పాటించిందని గుర్తు చేశారు. జనాభా ప్రాతిపదికకు బదులు దేశ ఆర్థిక వ్యవస్థలో దక్షిణాది రాష్ట్రాల వాటా ఆధారంగా సీట్ల పెంపును ఎందుకు చేపట్టకూడదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఆర్థిక వ్యవస్థలో 40 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదని, ఈ అంశాన్ని మెరిట్ లెక్కన తీసుకుని సీట్ల పెంపును చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతున్న దృష్ట్యా దక్షిణాదికి ఉండే మెరిట్ అంశాల అధారంగా సీట్ల పెంపును చేపట్టాలని సూచించారు. ‘‘జనాభాలో 2.5 శాతం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణది 5 శాతం వాటా. యూపీ కేంద్రానికి చెల్లించే రూపాయికి తిరిగి రూ.3.50, మధ్యప్రదేశ్ రూ.2.50, బిహార్ రూ.4.50కి పైగా పొందుతుండగా, దక్షిణాది రాష్ట్రాలు 50 పైసలలోపే పొందుతున్నాయి. నైరుతి (సౌత్ వెస్ట్) రాష్ట్రాలు ఆర్థికంగా ఆధిపత్యం చెలాయిస్తే.. ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం రాజకీయంగా ఆధిపత్యం చెలాయిస్తున్నాయి’’ అని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న జనగణన ఆధారంగా డీలిమిటేషన్ చేపట్టాలని, తెలంగాణలో కులగణనను ఐదు నెలల్లో చేశామని, కేంద్రం తలచుకుంటే ఆరు నెలల్లో పూర్తి చేస్తుందని, వచ్చే 2027 మార్చి వరకు జనగణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత 12 నెలల్లో డీలిమిటేషన్ పూర్తి చేసి, మహిళా రిజర్వేషన్లపై ముందుకెళ్లవచ్చని అభిప్రాయపడ్డారు. ‘‘కేరళ, యూపీ మధ్య లోక్‌సభ సీట్ల అంతరం ఇప్పుడు 60. ఎన్డీయే చెబుతున్న మాదిరిగా 50 శాతం సీట్ల పెంపు జరిగితే సీట్ల తేడా 90కి పెరుగుతుంది. ఇదే శాతాల పరంగా చూస్తే 100 నుంచి 150కి పెరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయి. బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సీట్లు సరిపోతాయి. డీలిమిటేషన్‌తో దక్షిణాదిలో సీట్లు 130 నుంచి 195 అయితే.. ఉత్తరాదిలో మొత్తం 600 సీట్ల వరకు ఉంటాయి’’ అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ పార్టీల సమస్య కాదని, ప్రాంతాలు, చిన్న రాష్ట్రాల ప్రజల సమస్యగా చూడాలని వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ జరిగితే ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య ఇప్పుడున్న అంతరం అలాగే ఉండేలా చూడాలన్నారు. కొన్ని ప్రాంతీయ పార్టీలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకించట్లేదంటే ఆయా పార్టీలు సరెండర్ అయ్యాయేమోనని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌పైనా డీలిమిటేషన్ ప్రభావం ఉంటుందని, కానీ, రాజకీయ కారణాలతో అక్కడి పార్టీలు సైలెంట్‌గా ఉన్నాయేమోనని అన్నారు.

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఎన్డీయే ఇప్పటి వరకూ అధికారికంగా స్పందించలేదని, ఎజెండాను కూడా విపక్షాలకు చెప్పలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ‘‘మహిళా రిజర్వేషన్లు కాంగ్రెస్ బ్రెయిన్ చైల్డ్. యూపీఏ హయాంలోనే ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ 100 శాతం కట్టుబడి ఉంది. అందుకు మాకేం అభ్యంతరం లేదు. కానీ, మహిళా రిజర్వేషన్లకు, డీలిమిటేషన్‌కు లింకు పెట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని ఎన్డీయే కుట్ర చేస్తోంది’’ అని ఆరోపించారు. ఎన్డీయే మెలికల్లో రాజకీయ స్వార్థం ఉందని, డీలిమిటేషన్ ముసుగులో ఓబీసీ రిజర్వేషన్ల విషయంలో మోసం చేయాలన్నది వాళ్ల ఉద్దేశమని తెలిపారు. ఇప్పుడున్న లోక్‌సభ సీట్లలో పురుషుల ప్రాతినిధ్యానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా కొత్తగా 272 సీట్లు పెంచి.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను ఇవ్వాలనుకుంటోందని, అందుకే, డీలిమిటేషన్‌ను ముందుకు తెస్తోందని వివరించారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కూడా కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపన్యాసాల్లో మోదీ ఏమైనా చెబుతారని, చంద్ర మండలాన్ని కూడా భూమి మీదకు తెచ్చానని చెబుతారంటూ సీఎం రేవంత్ చమత్కరించారు.

గద్దర్ గురించి ఇటీవల ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ స్పందించారు. గద్దర్‌ను కిషన్ రెడ్డి కలిసిన విషయం మోదీకి తెలియదేమో అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్లో జీవన్‌రెడ్డి చేరిక, కాంగ్రెస్పై కేటీఆర్ విమర్శలపై స్పందిస్తూ.. జీవన్ రెడ్డి చేరికను లాస్ట్ సప్పర్‌గా అభివర్ణించారు. ఆలె నరేంద్ర, దేశిని చిన మల్లయ్య, ఈటల రాజేందర్, విజయశాంతి, పొన్నాల లక్ష్మయ్య పరిస్థితి ఏమైందో అందరికీ తెలిసిందే కదా అని వ్యాఖ్యానించారు. పొన్నాల లక్ష్మయ్యను బీఆర్ఎస్లో ఎప్పుడైనా చూశారా? అంటూ ప్రశ్నించారు. ‘‘జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయాక వారి మీద గెలిచిన వారిని పార్టీలోకి చేర్చుకున్నారు. జూపల్లి, తుమ్మలకు కనీసం వార్డు మెంబర్ అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశం కూడా లేకపోయింది’’ అని గుర్తు చేశారు.

## ప్రధాని మోదీ హత్యకు కుట్ర..?

ఈ కుట్ర కోసం అమన్ తివారీ అమెరికా గూఢచార సంస్థ అయిన సీఐఏకు ఒక ప్రతిపాదన పంపించి, ప్రతిఫలంగా భారీ మొత్తంలో డబ్బును డిమాండ్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆ కుట్రను అమలు చేయడానికి అతను 22 రోజుల సమయం కూడా కోరాడు. ఈ సమాచారం అందిన వెంటనే, నిఘా సంస్థలు స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ విషయాన్ని జాతీయ భద్రతాపరమైన ఆందోళనగా పరిగణిస్తున్నారు. మొత్తం నెట్‌వర్క్‌పై దర్యాప్తు జరుగుతోంది. పోలీసులు వేగంగా చర్యలు చేపట్టి, ముగ్గురిని అరెస్టు చేశారు. అందిన నిఘా సమాచారం మేరకు, బక్సర్, దుమ్రాన్ పోలీసుల సంయుక్త బృందం రంగంలోకి దిగింది. బక్సర్ జిల్లాలోని అమన్ తివారీ ఇంటిపై దాడి చేసి అతడిని అరెస్టు చేశారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా మరో ఇద్దరిని అరెస్టు చేశారు. అయితే, వారి పేర్లను గోప్యంగా ఉంచారు. తదుపరి విచారణలో మరిన్ని వివరాలు వెల్లడి కావచ్చని పోలీసులు చెబుతున్నారు. నిందితులందరినీ నిఘా విభాగంగ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సోదాల సమయంలో అమన్ గది నుంచి ఒక ల్యాప్‌టాప్‌తో పాటు పలు ఎలక్ట్రానిక్ పరికరాలు లభ్యమయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ పరికరాలను సాంకేతికంగా పరిశీలిస్తున్నారు. ఇవి ముఖ్యమైన ఆధారాలు అందించగలవని పోలీసులు భావిస్తున్నారు. సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉన్నందున గదిని సీల్ చేశారు. అమన్ ఇంటి పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించారు. ఫోరెన్సిక్ దర్యాప్తు తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

అమన్ తివారీకి నేర చరిత్ర ఉందని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. 2022లో, అతను కోల్‌కతా విమానాశ్రయాన్ని ధ్వంసం చేయడానికి కుట్ర పన్నాడు. ఆ సమయంలో అతను విదేశీ పరిచయస్తులతో కూడా సంబంధాలు పెట్టుకున్నాడు. అయితే, కోల్‌కతా పోలీసులు అతడిని సకాలంలో అరెస్టు చేశారు. అతను మైనర్ కావడం వల్ల తీవ్రమైన చర్యల నుండి తప్పించుకున్నాడు, కానీ ఇప్పుడు ఈ కేసు మళ్లీ వెలుగులోకి వచ్చింది. అమన్ తివారీ కుటుంబం ఆర్థికంగా మధ్య తరగతికి చెందినది. అతని తండ్రి, గణేష్ తివారీ ధార్మిక కర్మకాండలు నిర్వహిస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. అమన్ స్థానిక పాఠశాలలు, కళాశాలల్లో చదువుకున్నాడు. పెద్దగా ఉన్నత చదువులు అబ్బలేదు. కానీ అతను ఇంటర్నెట్‌లో చాలా చురుకుగా ఉండేవారని పోలీసులు తెలిపారు. ఎక్కువ డబ్బు సంపాదించాలనే కోరికతో అతను ఈ కుట్ర పన్ని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అతను ఒంటరిగా ఈ పని చేశాడా లేక ఒక పెద్ద నెట్‌వర్క్‌లో భాగమా అని నిర్ధారించుకోవడానికి పోలీసులు, నిఘా సంస్థలు ప్రస్తుతం ఈ కేసును క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నాయి. సైబర్ కోణంలో కూడా దర్యాప్తు జరుగుతోంది. అంతర్జాతీయ సంబంధాలపై కూడా విచారణ కొనసాగుతోంది. రాబోయే రోజుల్లో మరిన్ని కీలక విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్లలో ఆనందం

- పేదల సొంతింటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది - భీమిడి జైపాల్ రెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 10 :**



ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తుందని అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని యాడరాం గ్రామంలో షేక్ అయిషా హైమద్ దంపతులకు ప్రభుత్వం 5 లక్షల రూపాయల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తో పాటు జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ లు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగు నింపుతోందని అన్నారు.5 లక్షల రూపాయల సహాయంతో పేద కుటుంబాలు సొంత ఇల్లు అనే కలను నిజం చేసుకుంటున్నాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుండి పనిచేస్తుందని వారు స్పష్టం చేశారు. కాగా ఇళ్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుదిల్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చిప్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ , ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులకు లబ్ధిదారురాలు షెక్ అయిషా హైమద్ దంపతుల ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.సొంతింటి కల నెరవేర్చిన ప్రజా ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్లు లింగోళ్ల హనుమాన్ దాస్ గౌడ్, సామల జశ్వంత్ రెడ్డి, గాదె వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి, నాయకులు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, కోదూరి దినేష్, కొమ్ము వినోద్, చిటుకుల రాజశేఖర్ రెడ్డి, లింగోళ్ల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కంఠం శిరీష కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- ఉచిత వైద్య శిబిరాలు ప్రజలు వినియోగించుకోవాలి: చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 10 :**

అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మెడిసిటీ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. అనంతరం వైద్యులు పలువురికి బీపీ, షుగర్, చెవి, ముక్కు, గొంతు, కణతులు, థైరాయిడ్ , గర్భసంచికి సంబంధించిన పరీక్షలు మరియు కంటి పరీక్షలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సంబంధిత సమస్యలు వంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సుమారుగా 110 మందికి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరం ఉన్న 32 మందిని మెడిసిటీ ఆస్పత్రికి తరలించారు. ఉచిత వైద్య శిబిరాలు అనేవి పేదలకు వరం లాంటివని, ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కమిషనర్ చంద్రశేఖర్, వైద్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఈ-గవర్నెన్స్ అవార్డు రేసులో యాదగిరిగుట్ట ఆలయం

- ఈ-సేవలపై రెండు రోజులుగా పరిశీలిస్తున్న కేంద్ర బృందం
- ఢిల్లీ బృందం నివేదిక ఆధారంగా అవార్డు ఎంపికకు సన్నాహాలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**




భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రదానం చేసే జాతీయ ఈగవర్నెన్స్ అవార్డులలో ఈ సంవత్సరం ఆధ్యాత్మికత,పర్యాటకం (టెంపుల్) కేటగిరీలో తెలంగాణ రాష్ట్రం నుండి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఎంపిక అయ్యింది. ఈ నేపథ్యంలో ఈ గవర్నెన్స్ ఢిల్లీ అధికారుల బృందం దేవస్థానంను సందర్శించారు. రెండు రోజులుగా ఆలయంలో అమలుపరచబడుచున్న ఈ ఆఫీస్ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయబడిన ఆన్ లైన్ సేవలను ఈ హుండీ,కంప్యూటరైజేషన్ సేవలు,కియాస్క్ మిషన్ ద్వారా సేవలు వాటి నిర్వహణ తీరును, భవిష్యత్తులో పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయుటకు అవకాశము కలిగియున్న తదితర అంశములను, పరిపాలన నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను రూపొందించారు.
ఈ నివేదిక ఆధారముగా యాదగిరిగుట్ట ఆలయం ఈ అవార్డుకు ఎంపిక చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా పరిశీలనకు విచ్చేసిన మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ అధికారులు రాకేష్, రాజేష్ యాదగిరిగుట్ట దేవస్థానంలో అమలు చేస్తున్న సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ మేరకు నివేదికను రూపొందించారు.



## దివ్యాంగులకు స్కూటీలు అందజేయాలని భువనగిరి ఎంపీకి వినతి

**జయభేరి, యాదాద్రి భువనగిరి జిల్లా:**

భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న దివ్యాంగులకు స్కూటీలు అందజేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కొడిదెల నరేష్ కోరారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్ లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దివ్యాంగులకు ఎంపీ నిధుల నుండి స్కూటీలు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 20 ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్నామని, కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ ఎంపీ,ఎమ్మెల్యేలు, గ్రామ పంచాయతీ,మున్సిపల్ ఎన్నికలు కోసం పనిచేసి గెలిపించుకున్నామని తెలిపారు. కావున కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న దివ్యాంగులకు స్కూటీలు అందజేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఎంపీ కోటా నుండి వచ్చే వాహనాలు మంజూరు చేసి మాకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు అనంతుల ఎల్లారెడ్డి, చిర్యాల ఉమారాణి, రంజిత్, రామ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాజా మాంసం షాప్ ప్రారంభం

- యువత స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపడం అభినందనీయం - నక్క ప్రభాకర్ గౌడ్

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 10 :**




శామీర్‌పేట్ డివిజన్ తుంకుంట లో మందాయిపల్లి రోడ్‌లో నూతనంగా తాజా మాంసం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకులు నేమూరి సాయికిరణ్ గౌడ్, నాగిరెడ్డి అవినాష్ రెడ్డి, జమల్‌పూర్ అజయ్, గనీ కలిసి ఏర్పాటు చేసిన ఈ మాంసం దుకాణాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ గారు హాజరై ప్రారంభించారు. ఈ షాప్ ద్వారా తాజా మాంసం, చికెన్,చేపలు,రొయ్యలు వినియోగదారులకు అందుబాటులో ఉండనున్నాయి. అదనంగా, తూంకుంట పరిసర ప్రాంతాల్లో 5 కిలోమీటర్ల పరిధిలో ఆన్‌లైన్ ద్వారా హోం డెలివరీ సౌకర్యం కూడా కల్పించబడుతుందని నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ యువత పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధిని సృష్టించుకోవడం అభినందనీయం అని తెలిపారు. ఈ తాజా మాంసం షాప్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు గోల్డ్ శ్రీనివాస్, ఎద్దు నాగేశ్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పచ్చిమద్ల నర్సింగ్ రావు గౌడ్, బొల్లబోయిన రాజు యాదవ్, నాయకులు కొడిమెల ఆంజనేయులు, రాజ్ పూత్ భరత్ సింగ్, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, టీఆర్ రవీందర్ గౌడ్, రాజనాల శ్రీధర్ రెడ్డి, కౌడే రూప్ కిరణ్ ,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పీసరి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

- హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నేతలు..



**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 10 :**

దేవరాయాంజాల్ మాజీ సర్పంచ్, అల్వాల్ సొసైటి మాజీ చైర్మన్ పీసరి శ్రీనివాస్ రెడ్డి తన జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కాగా ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక హనుమాన్ ఆలయంలో కాంగ్రెస్ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక ఆలయ అర్చకులు సీతారామచార్యులు, ఫణి కుమార్ ల ఆధ్వర్యంలో ఆయన పేరుపై అభిషేకాలు చేశారు. అనంతరం నేతలు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పీసరి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షునిగా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షునిగా ఎనలేని సేవలు అందించారని, కాంగ్రెస్ పార్టీకి , ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించారని కొనియాడారు. ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుని ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, రామాలయం మాజీ ధర్మకర్తలు పట్నం నర్సింహారెడ్డి, నానిగళ్ళ హరిగోపాల్, గుడిసేని హరిక్రిష్ణ, మాజీ వార్డు సభ్యులు మణిగొండ శ్యామ్ కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, కట్ట శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మీరు కట్టిన ప్రాజెక్టులు ఏవి

- మాజీ మంత్రి హరీష్ రావుకు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రశ్న




**జయభేరి, దేవరకద్ర :**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మీరు కట్టిన ప్రాజెక్టులు ఏమిటో చెప్పాలని మాజీ మంత్రి హరీష్ రావుకు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే, పాలమూరు జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే జూరాల, కల్వకుర్తి, కోయిల్ సాగర్, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులను కట్టడం జరిగిందన్నారు. పాలమూరు ప్రజలు ఏం చెప్పినా వింటారని హరీష్‌రావు మాత్రం అనుకుంటే అది పొరపాటన్నారు. గతంలో ఓట్లు వేసి ప్రజలు అధికారంలోకి తీసుకువచ్చిన, జిల్లాను అభివృద్ధి చేయకుండా వెనుకబాటు తనానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ప్రధాన కారణమయ్యారని జిఎంఆర్ ఆరోపించారు. వారి హయాంలో ప్రజా సంక్షేమం కుంటు పడిందన్నారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపడం జరిగిందన్నారు. ఆ విషయాన్ని గమనించి వారు అసలు కొంటె బాగుంటుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకుంటే మాత్రం ప్రజలు క్షమించారని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

## తీరనున్న తాగునీటి కష్టాలు

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 10 :**



అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్ గ్రామంలోని 14వ వార్డులో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి.ముఖ్యంగా ఎస్సీ కాలనీ ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా బతుకమ్మ చెరువు నుంచి ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ వరకు పైప్‌లైన్ పనులు కొనసాగుతుండడంతో ఇక తాగునీటి కష్టాలు తొలగిపోనున్నాయి. గత కొంతకాలంగా ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన స్థానిక కౌన్సిలర్ మౌనిక బాబు ప్రత్యేక చొరవ తీసుకుని బతుకమ్మ చెరువు నుంచి కాలనీలోని ఓవర్ ట్యాంక్ వరకు నేరుగా పైప్‌లైన్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి అన్ని, ఈ పనులను కౌన్సిలర్ మౌనిక బాబు స్వయంగా పరిశీలిస్తూ, ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, ఎస్సీ కాలనీలోని ప్రతి ఇంటికి తాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలే తమ ప్రాధాన్యమని, వార్డ్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. పైప్‌లైన్ పనులు పూర్తయితే తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలకు ఆర్థిక తోడ్పాటు



**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 10 :**

మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొల్తూరు గ్రామంలో ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ వేడుకల నిర్వహణ కోసం అలియాబాద్ మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేశ్ రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆయన చూపిన సమానత్వ మార్గాన్ని అనుసరిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని, ఈ సారి కూడా మరింత వైభవంగా జరిపేందుకు గ్రామస్తులు సమిష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కౌన్సిలర్ గాదె వెంకటేశ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు గాను సాయం చేయడానికి ముందుకు వచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సాయిలు, మల్లేష్,పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డిజిపి ముందు లొంగిపోయిన 42మంది మావోయిస్టులు..

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ముందు 42 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో సోడి మల్లా @కేశాల్, డివిజనల్ కమిటీ కార్యదర్శి చాప నారాయణ తదితరులు వున్నారు. 36 ఆయుధాలు, 800 గ్రాముల బంగారంతో పాటు జప్తు చేసారు. పలు కేసుల్లో కీలక పాత్ర పోషించిన మావోయిస్టు సభ్యులు లొంగుపోయారు. కొత్తగూడెం, నిజామాబాద్, భద్రాద్రి, గజేందర్ పై తదితర ప్రాంతాలలో వారిపై కేసులు నమోదయ్యాయి. మొత్తం 124 కేసుల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. 130 మందికి పైగా బాధితులు ఉన్న కేసులలో వీటిలో 42 కేసులు అత్యంత సీరియస్ కేసులున్నాయి.

# ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమం

- బీజేపీ సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య

**జయభేరి, షాద్ నగర్, ఏప్రిల్ 10 :**




భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీఆదేశాల మేరకు, దేశవ్యాప్తంగా అన్ని పార్లమెంట్లలో, గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు, అన్ని పార్లమెంట్లలో సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమం పాలమూరు పార్లమెంట్ పరిధిలో, మన ఎంపీ డీకే అరుణమ్మా ఆధ్వర్యంలో పార్లమెంట్ పరిధిలో 1400 టీమ్స్, షాద్ నగర్ నియోజకవర్గంలో 160 టీమ్స్ అత్యధికంగా పాల్గొన్నారు. ఇది క్రీడా ప్రోత్సాహానికి పెద్ద ఉదాహరణ అని కోఆర్డినేటర్ వంశీ కృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో, పార్లమెంట్ పరిధిలో, 1400 టీమ్స్, షాద్ నగర్‌లో 140 టీమ్స్ అద్భుతంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా, అందే బాబయ్య మాట్లాడుతూ... "క్రీడా స్ఫూర్తిని యువతలో పెంచాలని సదుద్దేశంతో ప్రధాని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. యువత చాలా మంది ఈ మధ్యకాలంలో క్రీడలకు దూరంగా ఉన్న సందర్భంలో, ఈ ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్స్కు దూరంగా ఉండి, అదే విధంగా సోషల్ మీడియాలో చెడుకి దూరంగా ఉండి, మంచిని పెంపొందే విధంగా ఉండాలి. అదే విధంగా, గెలుపోటములో సమానంగా కృషి చేసే శక్తి కేవలం క్రీడాకారులకే ఉంటంది, కాబట్టి రెగ్యులర్‌గా క్రీడలు ఆడడం వల్ల మానసికంగా, శారీరకంగా, అన్నివిధాలుగా క్రీడలు మనిషి యొక్క నిత్య జీవితంలో ఎంత దోహదపడతాయో అన్నారు.ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... యువత మత్తు, మద్యం,గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు.క్రమేపీ గ్రామాల్లో కూడా గంజాయి వాడకం యువతలో పెరిగిందని ఈ సందర్భంలో వారు గుర్తుచేశారు. మానసిక ఉల్లాసానికి, అదే విధంగా స్నేహభావాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో ధోహద పడుతాయని, ఎంపీ డీకే అరుణమ్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గొప్ప క్రీడా పోటీలను విజయం సాధించాలని, గెలుపొందినవారికి గవర్నర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం కార్యక్రమం ఉంటుందని అందరూ క్రీడా స్ఫూర్తితో ఈ కార్యక్రమంలో విజయవంతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ వంశీ కృష్ణ సీనియర్ నాయకులు దేపల్లి అశోక్ గౌడ్,అమడాపురం నరసింహా,ఇస్నాతి శ్రీనివాస్,మండల అధ్యక్షురాలు రొల్లు రాధిక కౌన్సిలర్ ,ప్యాట అశోక్, ఎలుగనమోనిఅభిషేక్, సొప్పరి నరసింహ,కోఆర్డినేటర్లు మహేశ్, నరేంద్ర రెడ్డియుగేందర్,శివాజీ,పవన్ కుమార్ రెడ్డి, ప్రవీణా,అంజయ్య,రాము ,రాకేష్,నర్సింహ,కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధికి సర్పంచులు అంకితభావంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**జయభేరి, పరకాల, ఏప్రిల్ 10:**

శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల, నడికుడ, దామెర, ఆత్మకూరు మండలాల పరిధిలోని సర్పంచ్ లు, అధికారులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నూతన సర్పంచులు అంకితభావంతో పనిచేయాలి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజలతో సమన్వయం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలి అని, ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరేలా సమర్థవంతంగా అమలు చేయాలి అని అన్నారు. అలాగే ఎండాకాలంలో నీటి ఎద్దడి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి అని, మిషన్ భగీరథ నీటి సరఫరా, బోరు బావుల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల అరికట్టడం, తదితర చర్యలు చేపట్టాలని అన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా


- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- కళాశాలలో వార్షికోత్సవ వేడుకల్లో వ్యాఖ్య నించిన ఎమ్మెల్యే



**జయభేరి, పరకాల, ఏప్రిల్ 10:**

శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని భవిష్యత్తులో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలని తెలిపారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ను క్రియేట్ చేస్తూ ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఆధునిక టెక్నాలజీ ని ఉపయోగించుకొని చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉంది అన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్షాలను ఎంచుకొని వాటి సాధన దిశగా అడుగులు వేయాలని తెలిపారు. కళాశాల అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు.

## షార్ట్ సర్క్యూట్ తో ఓ ఇంటిలో అగ్ని ప్రమాదం



**జయభేరి, మేడ్చల్ :**

జిహెచ్ఎంసి పరిధిలోని మేడ్చల్ సర్కిల్‌లోని కిష్టాపూర్ డివిజన్ అర్చన కాలనీలో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంటిలో మంటలు చెలరేగాయి. బాధితుడు మద్దూరి అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అల్మారా పూర్తిగా కాలిపోయిందని అందులో ఉన్న బట్టలు, నగదు దగ్ధమై సుమారు లక్షన్నర రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. సంఘటనను గుర్తించిన స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎవరికి ప్రాణహాని జరగలేదు.

## ఆర్టిజన్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు



**జయభేరి, కొండమల్లెపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణంలో కరెంటు DE కార్యాలయం వద్ద నిర్వహించిన విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగుల సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 వేతన సవరణ అమలు చేయాలి ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపడుతూ విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగుల న్యాయమైన కోరికలను అమలు చేయాలి ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది అని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు TVN రెడ్డి,విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- మాటిచ్చిన రెండు రోజుల్లో లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరు చేయించి,రేషన్ బియ్యం ఇప్పించిన నాయకుడు

**జయభేరి, షాద్ నగర్, ఏప్రిల్ 10 :**



ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రజా నాయకుడు ఎమ్మెల్యే శంకర్.రేషన్ మాటిచ్చిన రెండు రోజుల్లో రేషన్ కార్డు మంజూరు చేయించి, రేషన్ బియ్యం ఇప్పించిన నాయకుడు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. రెండు రోజుల క్రితం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను అదే గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన వరలక్ష్మి రేషన్ కార్డ్ కోసం ఎమ్మెల్యేను కోరింది. స్పందించిన ఎమ్మెల్యే ఒక్కరోజులోనే మహిళకు రేషన్ కార్డు మంజూరు చేయటంతో పాటు రేషన్ బియ్యాన్ని సైతం పంపిణీ చేశారు. రేషన్ కార్డు ఇప్పిస్తానని మహిళకు మాట ఇచ్చిన ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం రేషన్ కార్డు ఇప్పించారు. రేషన్ కార్డు అందజేసి సన్న బియ్యం అందించిన ఎమ్మెల్యేకు వరలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా కొత్తూరు పట్టణానికి ఎద్దుల లీలావతికి కూడా హామీఇచ్చిన రెండు రోజుల్లో రేషన్ కార్డు మంజూరు చేయించి బియ్యం అందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ముంతాజ్ బేగం,మున్సిపల్ కమిషనర్ బాలాజీ,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, వైస్ చైర్మన్ డోలి రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి,కౌన్సిలర్స్ వీరమోని హేమ దేవేందర్ ముదిరాజ్,చంద్రకళ రాజేందర్ గౌడ్,మాజీ సర్పంచి జగన్, ఏనుగు జనార్ధన్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ కుమారస్వామి గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్తయ్య, ఇందూరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోల్ల సురేందర్, మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్,మాజీ వార్డ్ సభ్యులు అంజనేయులు గౌడ్,గోవింద్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, మున్సిపాలిటీ కో శాధికారి చింత సాయి తేజేశ్వర్, సీనియర్ నాయకులు చిల్కామర్రి నరసింహ, నరసింహ గౌడ్,దేవేందర్ గౌడ్,రాములు గౌడ్,యువ నాయకులు శివకుమార్ గౌడ్, పెంటయ్య యాదవ్,కొండారెడ్డి సుమన్, విక్రమ్,అనిల్, తదితరులు పాల్గొన్నారు.



## స్టాఫ్ నర్స్ ఫలితాల్లో సంగ్య తండా వాసి ప్రతిభ

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 10 :**

తెలంగాణ ప్రభుత్వానికి చెందిన మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ తాజాగా విడుదల చేసిన నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) ఫలితాల్లో తుర్కపల్లి మండలం సంగ్య తండాకు చెందిన దిరావత్ మౌనిక ప్రతిభ సాధించింది. పేద కుటుంబానికి చెందిన దిరావత్ సర్వన్ నాయక్ నాలుగవ సంతానంగా జన్మించిన మౌనిక చిన్ననాటి నుండే చదువుపై ఆసక్తి చూపిన ఆమె ప్రభుత్వ మోడల్ స్కూల్లో ఇంటర్ వరకు విద్యను అభ్యసించింది. అనంతరం తన ప్రతిభతో హైదరాబాదులోని ప్రముఖ వైద్య సంస్థ ఆయన నేమ్స్ లో బిఎస్సి నర్సింగు సీటును సాధించింది చదువు పూర్తి చేసిన తర్వాత అదే ఆసుపత్రిలో సేవలు అందిస్తూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం కృషిచేసింది. తన కృషి పట్టుదలతో మొదటి ప్రయత్నంలోనే నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాన్ని సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. గిరిజన కుటుంబానికి చెందిన మౌనిక విజయం పట్ల గ్రామస్తులు బంధువులు వర్షాన్ని వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు. ఆమె విజయంతో గ్రామంలోని యువతకు ఆదర్శంగా నిలిచింది.

# మేడ్చల్ సర్కిల్ లో సిఎంసి సృజన పర్యటన

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ సర్కిల్ పరిధిలో పౌర సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన శుక్రవారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశ్, ఇతర విభాగాల అధికారులతో కలిసి మౌలిక సదుపాయాలు, భూగర్భ, మురుగునీటి వ్యవస్థ మరియు చెరువుల నిర్వహణపై కీలక సమీక్ష నిర్వహించారు. పనుల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. చెరువుల ఉనికిని కాపాడటమే ప్రధాన లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఏజెన్సీలు రంగంలోకి దిగి అన్ని జలవనరుల నుండి గుర్రపుడెక్కను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన సిబ్బందిని, యంత్రాలను వినియోగించాలని, గుర్రపుడెక్క మళ్ళీ పెరగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. మురుగునీటి వ్యవస్థ లో ఎక్కడా అడ్డంకులు లేదా లీకేజీలు లేకుండా పక్కాగా పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ లైన్ల పూడికతీత పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, డ్రైనేజీ ఓవర్ ఫ్లోపై వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. మేడ్చల్ హైవే నుండి అయోధ్య ఎక్స్ రోడ్స్ కలిపే ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని ఆదేశించారు. వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీ కాలువలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక యువత, నివాసితుల కోసం వినోద సౌకర్యాలను పెంచాలని కమిషనర్ సూచించారు. ఇందులో భాగంగా అవుట్ డోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లు, థీమ్ పార్కుల అభివృద్ధికి తగిన స్థలాలను గుర్తించి నివేదికలు అందజేయాలన్నారు. ముగింపు సందర్భంగా కమిషనర్ సృజన మాట్లాడుతూ సుస్థిర పట్టణాభివృద్ధికి సిఎంసి కట్టుబడి ఉందని, ప్రతి సర్కిల్‌లో పౌర సౌకర్యాల మెరుగుదలే ధ్యేయంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని తాను నిరంతరం పర్యవేక్షిస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## పలు గ్రామల్లో నేడు విద్యుత్తు అంతరాయం

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం ఏపీ ఈపీడీసీఎల్ ఈపి బోనంగి సెక్షన్ పరిధిలో శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపిడిసి ఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశపాత్రునిపాలెం, ధర్మారాయుడుపేట ఫీడర్ల పరిధిలో ఆర్ డి ఎస్ ఎస్ విద్యుత్తు పనుల నిర్వహణలో భాగంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు దేశపాత్రునిపాలెం, జాజుల వానిపాలెం, గొర్లివానిపాలెం, ధర్మారాయుడుపేట, జల్లెల పాలెం, శృంగారపాడు, బొట్ట వానిపాలెం, మోటూరు వానిపాలెం, రావాడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందని తెలిపారు. పైన తెలిపిన గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఈ ఈ మురళీకృష్ణ కోరారు.

# జి3045 యూనియన్ ఉమ్మడి విశాఖజిల్లా ప్రెసిడెంట్గా సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్గా శరణ్

**జయభేరి, పరవాడ :**



విశాఖ జిల్లా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ఏఈసిఈఏ జి 3045 రాష్ట్ర అధ్యక్షులు పి కాశీ మధుబాబు మరియు రాష్ట్ర కార్యదర్శి వి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేయడమైనది. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రెసిడెంట్ జి. సంతోష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్, బండారు శరన్ కుమార్, కోఆర్డినేటర్ బి వెంకట్రావు, జనరల్ సెక్రటరీ కే సుబ్రహ్మణ్యం మూర్తి, ట్రెజరీ ఎం కనకరాజు మరియు వైస్ ప్రెసిడెంట్స్, అడిషనల్ సెక్రటరీలు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఉమెన్ సెక్రెటరీలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖపట్నం జిల్లా ఏపీ ట్రాన్స్కో కమిటీ గతంలో నియమించబడినప్పటికీ, రాష్ట్ర కమిటీతో సమన్వయం లోపించడం, కొంతమంది సభ్యులు వ్యక్తిగత కారణాల వలన యూనియన్ కార్యకలాపాల్లో సమర్థవంతంగా పాల్గొనలేకపోవడం కారణంగా, జిల్లా కమిటీని పూర్తిగా ప్రక్షాళన చేసి నూతన కమిటీని రాష్ట్ర కోర్ కమిటీ నియమించింది. ఇకపై ఏఈసిఈఏ జి 3045 యూనియన్‌కు సంబంధించిన అన్ని అధికారిక కార్యకలాపాలు, నిర్ణయాలు, ప్రకటనలు ఈ నూతన కమిటీ ద్వారానే నిర్వహించబడతాయి. యూనియన్ పేరుతో ఇతరులు చేసే ప్రకటనలకు సంఘానికి ఎలాంటి సంబంధం ఉండదని తెలిపారు. ఇక్కడ సాధ్యం కాని సమస్యలను రాష్ట్ర కమిటీకి నివేదించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## ప్రాదిమిక ఆరోగ్య కేంద్రంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**

8వ పోషణ పక్వాడ ఏప్రిల్ 9 నుంచి 23లో భాగంగా పరవాడ పీహెచ్సి లో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఏ శ్యామల కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం గర్భవతులు బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పిల్లల్లో 80 శాతం మెదడు అభివృద్ధి రెండు సంవత్సరాలలోపు జరుగుతుందని పిల్లలను సెల్ ఫోన్లుకు దూరంగా ఉంచాలని పిల్లలకు బొమ్మలు పుస్తకాలు,కథల పుస్తకాలు చూపిస్తూ కథలు మెదడు అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు వైద్యాధికారిని కరిష్మా జయశ్రీ మాట్లాడుతూ పిల్లలకు చిప్స్ ప్యాకెట్లు ఇవ్వకూడదని ఇంట్లో తయారు చేసింది మాత్రమే పెట్టాలని, సాల్ట్ షుగర్ ఆయిల్ వాడకం తగ్గించాలని అలాగే గర్భవతి డెలివరీ అయిన వెంటనే పిల్లలకు ముదురుపాలు పట్టించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి వస్తుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పీహెచ్ఎం జానకి, అంగన్వాడీ టీచర్లు దేవి, చుక్క అరుణ,పార్వతి,సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**చైర్మన్, వార్డు సభ్యుల సమన్వయం**

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో ఇటీవల ఉధృతమైన వాటర్ లీకేజీ సమస్య స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగించింది. పలు రోజులుగా పైప్‌లైన్ లోపం కారణంగా నిరంతరంగా నీరు లీక్ అవుతూ రహదారులపై నిల్వవడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బంది పడటమే కాకుండా, పరిశుభ్రత సమస్యలు కూడా తలెత్తాయి. ఈ సమస్యను గుర్తించిన స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయగా, 16వ వార్డు సభ్యులు కేతావత్ రూప్లా నాయక్ వెంటనే స్పందించి సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం విశేషం.



**సంఘటనా స్థలానికి చైర్మన్ సందర్శన సమస్యపై సమగ్ర సమీక్ష**

ఈ నేపథ్యంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్నా శైలజ వెంకటేశ్వర్లు స్వయంగా సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. లీకేజీ తీవ్రత, దాని ప్రభావం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రత్యక్షంగా అవగాహన పొందారు. సంబంధిత ఇంజినీరింగ్ సిబ్బందితో చర్చించి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు.

**అత్యవసర మరమ్మత్తు పనులు ప్రారంభం యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు**

చైర్మన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు ప్రారంభించారు. లీకేజీ ఉన్న పైప్‌లైన్ భాగాన్ని గుర్తించి తక్షణమే మరమ్మత్తులు చేపట్టడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు మళ్లీ తలెత్తకుండా పాత పైప్‌లైన్ మార్పిడి అవసరాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

**మోటార్ పంపులతో నీటి తొలగింపు ప్రజలకు ఉపశమనం**

లీకేజీ కారణంగా రహదారులపై భారీగా నిల్వైన నీటిని తొలగించేందుకు మోటార్ పంపులను వినియోగించారు. సిబ్బంది గంటల పాటు శ్రమించి నీటిని బయటకు పంపించడంతో రహదారులు మళ్లీ సాధారణ స్థితికి చేరుకున్నాయి. దీని వల్ల స్థానికులకు కొంతవరకు ఉపశమనం లభించింది.

**పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి ఆరోగ్య సమస్యలకు చెక్**

నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, దుర్వాసన వంటి సమస్యలు తలెత్తే అవకాశముండటంతో మున్సిపల్ సిబ్బంది వెంటనే శానిటేషన్ చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించి కాలనీలో పరిశుభ్రతను మెరుగుపరిచారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవడం ప్రశంసనీయంగా మారింది.

ప్రజలతో ముఖాముఖి సమస్యలపై చైర్మన్ స్పందన సందర్భంగా చైర్మన్ పున్నా శైలజ వెంకటేశ్వర్లు స్థానికులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల పరిస్థితి వంటి అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

**వార్డు సభ్యుడి చొరవ ప్రజలకు అండగా నిలిచిన రూప్లా నాయక్**

ఈ సమస్య పరిష్కారంలో వార్డు సభ్యులు కేతావత్ రూప్లా నాయక్ కీలక పాత్ర పోషించారు. సమస్యను వెంటనే గుర్తించి అధికారులతో సమన్వయం చేస్తూ పనులను వేగవంతం చేయడంలో ఆయన చొరవ చూపారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడం పట్ల స్థానికులు ఆయనను అభినందించారు.

**ప్రజల ప్రశంసలు అధికారులపై విశ్వాసం పెంపు**

మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించే విధానం ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొన్నారు.

**ప్రజలకు విజ్ఞప్తి సమస్యలు వెంటనే తెలియజేయండి**

పట్టణంలో ఎక్కడైనా వాటర్ లీకేజీ, డ్రైనేజీ సమస్యలు లేదా ఇతర మౌలిక వసతుల లోపాలు తలెత్తినప్పుడు వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలను కోరారు. ప్రజల సహకారం ఉంటే సమస్యలను మరింత త్వరగా పరిష్కరించవచ్చని తెలిపారు.

**శాశ్వత పరిష్కారంపై దృష్టి మౌలిక వసతుల అభివృద్ధికి కృషి**

దేవరకొండ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ యంత్రాంగం తెలిపింది. పాత పైప్‌లైన్ల మార్పిడి, నూతన నీటి సరఫరా వ్యవస్థ, మెరుగైన డ్రైనేజీ సదుపాయాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

---




## 2225 ధర పలికిన కింటాల్ ఆర్ ఎన్ ఆర్ ధాన్యం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం రైతులు 1500 క్వింటాళ్ల ఆర్ ఎన్ ఆర్ ధాన్యాన్ని విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి క్వింటాల్ కు అత్యధికంగా రూ. 2225 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.2019 ధర పలికింది. అలాగే 246 క్వింటాళ్ల హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. వీటికి అత్యధికంగా క్వింటాల్ కు రూ.7509 ధర పలికింది. అతి తక్కువగా రూ. 1650 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

---

## దేవరకద్రలో వైభవంగా వాసవి మాత పల్లకి సేవ

**అలంకరణలో భక్తులకు అమ్మవారి దర్శనం**



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి పల్లకి సేవ పవిత్ర పూజా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో భక్తశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దేవస్థానం చుట్టు పల్లకిలో తీసుకొని ప్రదక్షిణలు నిర్వహించారు. పురోహితుల వేద మంత్రాలు, భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం దేవస్థానం ప్రధాన అర్చకుడు తరిమల హరి శంకర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. విశేషాలు సందర్భంగా వాసవి మాత అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో అమ్మవారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, వీహెచ్ పి జిల్లా మాజీ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య, యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ లతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---

## హర్యానా లో గుడివాడకు చెందిన టేకి దారుణ హత్య

**జయభేరి, చండీఘడ్ :**

హర్యానలో గుడివాడకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ బండ్ల రుషికేష్ (27) దారుణ హత్యకు గురయ్యాడు. రుషి పంచకుల వేది టెక్నాలజీస్ కంపెనీ లో 10రోజుల క్రితం ఉద్యోగంలో చేరాడు. శుక్రవారం కంపెనీ రూమ్ లో రక్తపు మడుగులో పడి ఉన్న రుషిని తోటి ఉద్యోగులు గమనించారు. బేతవోలులో ఉన్న కుటుంబ సభ్యులకు రుషి మరణ వార్తను గుడివాడ 1టౌన్ పోలీసులు తెలియచేసారు.

---

# దశాబ్దాల కల సాకారం మంత్రి పదవి రేసులో బాలు నాయక్

**జయభేరి, దేవరకొండ :**



నల్లగొండ జిల్లా రాజకీయాల్లో కీలక మలుపు చోటుచేసుకోబోతోంది. వెనుకబడిన ప్రాంతంగా పేరున్న దేవరకొండ నియోజకవర్గానికి ఈసారి రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత స్థానం దక్కబోతున్నట్లు తెలుస్తోంది. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కు మంత్రి పదవి దాదాపు ఖరారైందన్న వార్త ఇప్పుడు గిరిజన పల్లెల్లో పండుగ వాతావరణాన్ని తెచ్చింది.

**గిరిజన బిడ్డకు అరుదైన అవకాశం**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బలమైన గిరిజన నేతగా ఎదిగిన బాలు నాయక్, ప్రజలతో మమేకమయ్యే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఎస్టీ కోటాలో మంత్రి పదవి కోసం పలువురి పేర్లు పరిశీలనలోకి వచ్చినప్పటికీ, బాలు నాయక్ విధేయత, నియోజకవర్గంలో ఆయనకున్న పట్టు, సామాజిక సమీకరణలు ఆయనకు ప్లస్ పాయింట్‌గా మారాయి. అధిష్ఠానం కూడా ఆయన వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

**నెరవేరనున్న నియోజకవర్గ ప్రజల కల**

దేవరకొండ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుండి ఇక్కడి నుంచి గెలిచిన వారికి మంత్రి పదవి దక్కడం అనేది ఒక తీరని కలగానే మిగిలిపోయింది. ఇప్పుడు బాలు నాయక్ రూపంలో ఆ కల సాకారం కాబోతుండటంతో స్థానిక ప్రజలు, కార్యకర్తలు ఆనందంలో మునిగిపోయారు.

**అభివృద్ధిలో కొత్త శకం**

మంత్రి పదవి దక్కితే, దేవరకొండ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులు, గిరిజన తండాల అభివృద్ధి నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. బాలు నాయక్ తనదైన శైలిలో జిల్లా రాజకీయాలను ప్రభావితం చేయగలరని, మంత్రిగా బాధ్యతలు చేపడితే నియోజకవర్గం రూపురేఖలు మారుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉన్నప్పటికీ, గాంధీ భవన్ వర్గాల సమాచారం ప్రకారం బాలు నాయక్ పేరు జాబితాలో ముందు వరుసలో ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. ప్రజల ఆకాంక్ష బాలు నాయక్ దేవరకొండ మాజీ సర్పంచుల ఫోరం ముఖ్య సలహాదారులు, గొట్టిముక్కల మాజీ సర్పంచ్ కదారి అయ్యన్న యాదవ్ బాలు నాయక్ కి మంత్రి పదవి దక్కడం అంటే అది కేవలం ఒక వ్యక్తికి దక్కిన గౌరవం కాదు, యావత్ దేవరకొండ ప్రజల ఆకాంక్ష నెరవేరడమే. ఈ పదవితో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాం.

---

# ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

**జయభేరి, పరవాడ:**




మండల కేంద్రమైన పరవాడ లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టే చర్యలు తీసుకోవాలని శుక్రవారం పరవాడ మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పరవాడ గ్రామంలో సర్వే నెంబర్ 259లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం 1.43 సెంట్లు భూమి కేటాయించి సంవత్సరం అవుతున్న క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న ఈ భూములో ప్రభుత్వం వారు ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడం అన్యాయం అన్నారు. వెంటనే ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించి కార్మికుల్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరవాడ ఫార్మసిటీ, ఎన్టిపిసి, చిన్న తరహా పరిశ్రమల్లో ఏ చిన్న ప్రమాదం జరిగిన విశాఖపట్నం, అనకాపల్లి గాయపడ్డ వారినితరలించవలసి వస్తుందని ఈ లోపు మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారని వెంటనే ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు. బర్న్స్ వార్డ్ ఏర్పాటు చేసి కార్మికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేకసార్లు దరఖాస్తులు పెడుతున్నామని ఆందోళన చేస్తున్నామని కనీసం పట్టించుకునే చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని ఈ ప్రభుత్వానికి కార్మికుల సంక్షేమ పట్టడం లేదని విమర్శించారు. ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గని శెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె నాయుడు, శ్రీను, గురునాథం, తదితరులు పాల్గొన్నారు.

---

## మైసమ్మ ఆలయ పునఃనిర్మాణం

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ లక్ష్మి నారాయణ కాలనీలో శ్రీశ్రీశ్రీ మల్లెల మైసమ్మ ఆలయ పునఃనిర్మాణం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి పునఃనిర్మాణ కార్యక్రమాలు భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

---



## బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలి

**బడిబాట కార్యక్రమంలో సర్పంచ్ బొత్త రాములు**

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 10 :**

ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలని సర్పంచ్ బొత్త రాములు అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నందు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం గంధముల నందు ఫ్రీ ప్రైమరీని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, మరియు మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుజాత మాట్లాడుతూ జడ్పీ హైస్కూల్ కు 5వ తరగతి విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాకూబ్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అంగన్వాడి టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## విద్యార్థులకు అల్పాహారం అందజేత

**అల్పాహారాన్ని అందజేస్తున్న సర్పంచ్ తునికి లక్ష్మీరామిరెడ్డి**



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 10 :**

తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నుండి 23 తారీకు వరకు అల్పాహారాన్ని అందజేస్తున్నట్లు సర్పంచ్ తునికి లక్ష్మీరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం పూట ఏమీ తినకుండా పాఠశాలకు వస్తున్నారని అది గమనించి అల్పాహారాన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గజిటెడ్ హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

---

## హెచ్ పివి వ్యాక్సిన్ సురక్షితం

**బాలికలు తప్పనిసరిగా వేయించుకోవాలి**



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 10 :**

హెచ్ పి వి వ్యాక్సిన్ సురక్షితం బాలికలు తప్పనిసరిగా వేయించుకోవాలి మండల వైద్యాధికారి డాక్టర్ రుచిరా రెడ్డి అన్నారు శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలలో గర్భసంచి క్యాన్సర్ నివారక హ్యూమన్ పాపిలోమా వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల లోపు బాలికలకు అందరికీ ఈ వ్యాక్సిన్ ను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## వెంకటేష్ చిత్రపటానికి నివాళులర్పించిన సిఐటియు నాయకులు



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 10 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నాగాయపల్లి తండాకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు పెయింటర్ పని ముగించుకొని తన స్వగ్రామానికి వెళుతుండగా ప్రమాదవశాత్తు మరణించిన ధరావత్ వెంకటేష్ చిత్రపటానికి శుక్రవారం సిఐటియు శ్రీ పలుగుల మైసమ్మ తల్లి పెయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు పోతరాజు జహంగీర్ మాట్లాడుతూ ఆయన కుటుంబానికి సిఐటియు యూనియన్ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగం పెయింటర్స్ యూనియన్ నాయకులు ఆకుల రాజు, యేష బోయిన సత్యనారాయణ, మేడిపల్లి రాజు, పిడుగు శ్రీశైలం, సంతోష్ గౌడ్, బొట్ల శ్రీశైలం, పిడుగు భరత్, నక్కల కొండయ్య, చేర్యాల నర్సింలు, ఎండి యూనిస్, ఎస్.కె షరీఫ్, సిహెచ్ ఉప్పలయ్య, డి రాజేందర్, కనకరాజు , జహంగీర్ పాల్గొన్నారు.

## గోల్డెన్ ఛాన్స్ కొట్టేసిందిగా..



'ధురందర్', 'ధురందర్: ది రివెంజ్' చిత్రాల విజయంతో సారా అర్జున్ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. ఇప్పుడీ అమ్మడికి వరుసగా అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే యుఫోరియా సినిమాలతో తన నటనతో ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు తన కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడిన పాత్రకు సిద్ధమవుతోంది. భారతీయ సినిమా దిగ్గజం, ఎవర్ గ్రీన్ బ్యూటీ మధుబాల బయోపిక్‌లో సారా అర్జున్ ఆమె పాత్రను పోషించనున్నారని వార్తలు వస్తున్నాయి . ఈ చిత్రానికి 'డార్లింగ్స్' ఫేమ్ దర్శకుడు జస్మీత్ కె. రెయిన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. ఈ ఏడాది చివరి నాటికి చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మధుబాల స్వర్ణయుగాన్ని పునఃసృష్టించేందుకు చిత్ర బృందం భారీ సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు అనుగుణంగా చిత్రాన్ని తీర్చిదిద్దేందుకు చాలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా మధుబాల ఆకర్షణ, అందాన్ని తెరపైకి తీసుకురావడానికి సారా అర్జున్ చాలా కష్టపడాల్సి ఉంది. ఈ క్రమంలో ఆ కాలం నాటి భాషా శైలిలో ప్రావీణ్యం సంపాదించడానికి సారాకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని తెలుస్తోంది. మధుబాల ఐకానిక్ లుక్‌స్‌ను రీక్రియేట్ చేసేందుకు ఇప్పటికే అనేక లుక్ టెస్ట్‌లు జరుగుతున్నాయని సమాచారం. దర్శకుడు జస్మీత్ కె. రీన్ ఈ చిత్రాన్ని కేవలం ఒక విజయగాథగా కాకుండా, మధుబాల జీవితంలోని ఒడిదుడుకులను, భావోద్వేగ సంఘర్షణలను చిత్రీకరించే ఒక ఇంటెన్స్ డ్రామాగా తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రం మధుబాల వ్యక్తిగత జీవితంలోని రహస్యాలతో పాటు ఆమె కెరీర్‌లోని మైలురాళ్లను ఆవిష్కరిస్తుందని సమాచారం. "భారతీయ సినిమా రంగంలో అత్యంత అభిమానించే నటీమణులలో ఒకరి జీవిత కథ ఆధారంగా సినిమా తీయడం ఒక బాధ్యతాయుతమైన పని. సారా అర్జున్ ఆ పాత్రకు న్యాయం చేస్తుందని మాకు పూర్తి నమ్మకం ఉంది," అని చిత్ర బృందంలోని ఒక వ్యక్తి చెప్పినట్లు సమాచారం.



## మైఖేల్ జాక్సన్‌గా మేనల్లుడు జాఫర్ జాక్సన్.. ఉర్రూతలూగిస్తున్న 'మైఖేల్' ట్రైలర్

ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## కూతురుతో కలకత్తాపురిలో..



సంక్రాంతి విజయం 'మన శంకర వరప్రసాద్‌గారు'తో ఈ ఏడాది శుభారంభాన్ని పలికారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. ఆయన తదుపరి చిత్రం 'విశ్వంభర' కూడా ఈ ఏడాదే విడుదల కానున్నది. ఇదిలావుంటే.. కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో చిరంజీవి ఓ చిత్రాన్ని చేయనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలుకానున్నది. బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య'తో బ్రదర్ సెంటిమెంట్‌తో ఆడియన్స్‌ని ఆకట్టుకున్న దర్శకుడు బాబీ.. ఈ సారి మెగాస్టార్‌లో అద్భుతమైన తండ్రిని ఆవిష్కరించనున్నారట. తండ్రీ కూతుళ్ల సెంటిమెంట్ చుట్టూ ఈకథ నడుస్తుందని, అలాగే, కోల్‌కతా నగర నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని విశ్వసనీయ సమాచారం. పవర్‌ఫుల్ మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ చిత్రంలో మెగాస్టార్ కూతురి పాత్రకు 'జీనియస్'ఫేం అనస్వర రాజన్‌ని ఎంపిక చేసినట్టు తెలిసింది. గతంలో కోల్‌కతా నేపథ్యంలో కూతురిని అన్వేషించే తండ్రిగా 'చూడాలని ఉంది' చేశారు చిరంజీవి. ఈసారి టీనేజ్‌లో ఉన్న అమ్మాయి తండ్రిగా అదే కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తారన్నమాట. మెగా అభిమానులకు ఇది నిజంగా ఉత్సాహాన్ని నింపే వార్తే.

## వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో!



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు'. ఇండోకొరియన్ నేపథ్యంలో హారర్‌కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.



## రాకా కోసం 25కోట్లు?

డిమాండ్లు ఎక్కువ కావడంతో, చేస్తున్న సినిమాల నుంచి తొలగించబడి, ఉన్న డిమాండ్ కోల్పోయిందంటూ కొన్ని సోషల్ మీడియా వేదికలు దీపిక పదుకొణేపై వార్తలు రాశాయి. అయితే.. తాజాగా వినిపిస్తున్న ఓ బీటౌన్ వార్త.. దీపిక డిమాండ్ ఇసుమంత కూడా తగ్గలేదని, ఇంకా మాట్లాడితే, మరింత పెరిగిందని చెబుతున్నది. వివరాల్లోకెళ్తే.. అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పానిండియా చిత్రం 'రాకా'లో దీపిక పదుకొణే కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నటించినందుకు గాను ఏకంగా 25కోట్ల పారితోషికాన్ని దీపిక పదుకొణే అందుకుంటున్నదట. ఇదే ఆ వార్త సారాంశం. భారతీయ చలనచిత్ర చరిత్రలో ఇంత పారితోషికం తీసుకున్న హీరోయిన్ మరొకరు లేరు. ఈ వార్త వాస్తవమైతే.. నిజంగా ఇది రికార్డే. అంతేకాదు, దీపికకు డిమాండ్ తగ్గిందని వార్తలు రాసిన వాళ్లకు ఈ వార్త ఓ చెంపపెట్టు. అల్లు అర్జున్, అట్లీ కూడా ఈ సినిమా కోసం భారీ పారితోషికాలనే తీసుకుంటున్నట్టు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ భారీ పానిండియా చిత్రం 2027 వేసవిలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**